# వేసవిలో ఏ ఒక్క వినియోగదారుడికీ విద్యుత్ సరఫరా సమస్యలు ఉండొద్దు



సందీప్ కుమార్ సుల్తానియా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేసవి కాలంలో ఏ ఒక్క వినియోగదారుడికి విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా అందజేయడం కోసం జిహెచ్‌ఎంసి పరిధిలోని ట్రాన్స్ కో, టిజిఎస్‌పిడిసిఎల్ తీసుకున్న చర్యలపై విద్యుత్ అధికారులతో విద్యుత్ సౌధలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రాంతాల్లో విద్యు త్ డిమాండ్ వార్షిక పెరుగుదల 30 శాతానికి మించి నమోదవుతుంది . గతేడాది వేసవి అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ట్రాన్స్‌కో పరిధిలో బౌరంపేట్, పఠాన్ చేరు, ఆర్‌సి పురం, మౌలా అలీ, బండ్ల గూడా, గచ్చిబౌలి, కైతలాపూర్, బొల్లారం ఇహెచ్‌టి సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీ లను పెంచినట్లు, దీని వలన డిమాండ్ ఎంతగా పెరిగినా సరఫరాలో సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉండవని ట్రాన్స్ కో అధికారులు తెలియజేసారు. టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి మాట్లాడుతూ.. గతేడాది జిహెచ్ఎంసి అత్యధిక డిమాండ్ 4352 మెగావాట్లుగా రికార్డు అయ్యిందన్నారు. నగరం పెరుగుదల, గృహ, పారిశ్రామిక విద్యుత్ అవసరాలను బట్టి చూస్తే విద్యుత్ డిమాండ్ ఈ వేసవిలో 5000 మెగా వాట్లకు మించిందని తెలియజేసారు. 33/11/ఎల్‌టి స్థాయిలలో అవసరమైన స్థాయిలో అదనపు పిటిఆర్‌లు, డిటిఆర్‌లు, నూతన ఫీడర్లు అమర్చామన్నారు. ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టంలో భాగంగా దాదాపు 5062 11 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా పని తీరను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. డిటిఆర్ స్థాయి వరకు విద్యుత్ సరఫరా తీరును పర్యవేక్షించేందుకు సాంకేతికంగా పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెరుగుతున్న డిమాండ్ కు తగ్గట్టు సాంకేతికంగా సంసిద్ధమవడం ఒక భాగమైతే, అనుకోకుండా ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉత్పన్నమయినప్పుడు దాన్ని అతి తక్కువ సమయంలో ఎదుర్కొని సమస్య పరిష్కరించడంపై కూడా మరింత శ్రద్ధ వహించాలని, వినియోగదారులకు 100 శాతం సంతృప్తికర సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ట్రాన్స్ కో జెఎండి సి. శ్రీనివాస రావు, డైరెక్టర్ జగత్ రెడ్డి, టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్‌లు నంద కుమార్, సాయి బాబా, డా.నర్సింహులు, సుధా మాధురి, ట్రాన్స్ కో మరియు టిజిఎస్‌పిడిసిఎల్ జోనల్ చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జనాభా కంటే మొబైల్ ఫోన్లే అధికం

4.4 కోట్ల మొబైల్ ఫోన్లు, 3.64 కోట్లకు పైగా ఇంటర్‌నెట్ వినియోగదారులతో దేశంలోనే 4వ స్థానంలో తెలంగాణ

వెల్లడించిన టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నివేదిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జనాభా కంటే మొబైల్ ఫోన్లు అధికంగా ఉన్నాయని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) వెల్లడించింది. ట్రాయ్ 2024 సెప్టెంబర్ నివేదికను విడుదల చేసింది. తెలంగాణలో మొబైల్ ఫోన్ల సంఖ్య జనాభాను మించిపోయినట్లు ట్రాయ్ నివేదిక 2024 స్పష్టం చేసింది. దేశంలో సగటున ప్రతి వంద మందికి 82 శాతం మాత్రమే ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వంద మందికి 105కు పైగా మొబైల్ ఫోన్లు ఉన్నట్లు వెల్లడించింది. ఫలితంగా వైర్ లైస్ టెలీడెన్సిటీలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మొబైల్ ఫోన్లు వినియోగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక సర్వే 2025లో ఇందుకు సంబంధించిన వివరాలను పొందుపరిచారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ 2024 సెప్టెంబర్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో మొత్తం 4 కోట్ల 19 లక్షల 40 వేల మంది టెలిఫోన్ వినియోగదారులు ఉండగా, అందులో 96.38 శాతం అంటే 4 కోట్ల 4 లక్షల 20 వేల మొబైల్ ఫోన్లు, 15 లక్షల 25 వేల ల్యాండ్ లైన్ ఫోన్లు 3.62 శాతంగా ఉన్నాయి. మొబైల్ ఫోన్ల వినియోగానికి సంబంధించి రాష్ట్ర వైర్ లైస్ టెలీడెన్సిటీ 105.32గా ఉంది. కాగా రాష్ట్రంలోని టెలిఫోన్ వినియోగదారుల్లో 60 శాతానికి పైగా పట్టణ ప్రాంతాల్లో, 39 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారు. మొబైల్ ఫోన్లకు సంబంధించి చూస్తే పట్టణ ప్రాంతాల్లో 59 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 41 శాతం వినియోగదారులు ఉన్నారు. ల్యాండ్ లైన్ వినియోగదారుల్లో 96 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉండగా కేవలం నాలుగు శాతం మాత్రమే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారు. మొబైల్ ఫోన్ల వినియోగంలో తెలంగాణ దేశంలోనే నాలుగో స్థానంలో ఉంది. గోవా 152, కేరళ 115, హర్యానా 114 శాతంతో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. 104 శాతంతో పంజాబ్ తర్వాత స్థానంలో తెలంగాణ ఉంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ 78.93 శాతంతో ఉంది. మరోవైపు 3.64 కోట్లకు పైగా ఇంటర్‌నెట్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో 97.92 శాతం బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం ఉండగా కేవలం రెండు శాతం మాత్రమే నారో బ్యాండ్ సదుపాయం ఉంది. ఇంటర్‌నెట్ వినియోగదారుల్లో పట్టణ ప్రాంతాల్లో 63.74 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 36.26 శాతం మంది ఉన్నారని ట్రాయ్ నివేదిక తెలిపింది.

## 25న లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్, పోస్టులకు జాబ్‌మేళా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో రిలయన్స్ నీపోన్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా (మహిళలకు మాత్రమే) నిర్వహించనుంది . ఉస్మానియా యూనివర్సిటీ, ఆరట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. రిలయన్స్ నిఫోన్( ఇన్సూరెన్స్) లోని 30 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డిగ్రీ ,పిజీ ఏదైనా డిగ్రీ, చేసిన 29 నుండి 45*సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో చీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. మరిన్ని వివరాలకు హెచ్‌ఆర్ జోషి 8340 037123 సెల్‌నెంబర్ ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా మార్చ్25న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎవైసిఎ,టిడిసిఎను అభినందించిన డిజిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ (ఎవైసిఎ) క్రీడాకారులతో తెలంగాణ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ (టిడిసి ఏ) వన్డే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నందున వారిని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ అభినందించారు. డిజిపి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ షీల్‌ను, లోగోలను డిజిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ.... మార్చి 24వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగనున్న ఆరు వన్డే మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అండర్ 17 జట్టులో పాల్గొనే ఎవైసిఎ, టిడిసిఏ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమెరికన్ యూత్ క్రికెటర్ అకాడమీ అధ్యక్షులు కొలిపాక అరుణ్, తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, కె.రామిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్స్‌పై స్పందించిన ప్రకాష్‌రాజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో నటుడు ప్రకాశ్ రాజ్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం తాను ఓ సినిమా చిత్రీకరణలో ఉన్నానని వెల్లడించారు. 2016లో ఓ గేమింగ్ యాప్ కు పబ్లిసిటీ చేశానని, కొన్ని నెలల తర్వాత అది ఇల్లీగల్ అని తెలియడంతో, ఆ కాంట్రాక్ట్ నుంచి వైదొలిగానని వెల్లడించారు. అక్కడ్నించి గాంబ్లింగ్ కు సంబంధించి ఎలాంటి ప్రకటనల్లో నటించలేదని వివరించారు. అయితే, తాను గతంలో ప్రచారం చేసిన గేమింగ్ సంస్థను 2021లో వేరొకరు కొనుగోలు చేసినట్టు తెలిసిందని, వారు తన పాత ప్రకటనలతో ప్రచారం చేసుకోవడం గమనించి లీగల్ నోటీసులు పంపించడం జరిగిందని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. ఆ సంస్థతో తనకు కాంట్రాక్టు లేదన్న విషయం వారికి తెలియజెప్పానని అన్నారు.

## జనన మరణ విభాగాల సమన్వయంతో ఓటర్ల జాబితాల పునరుద్ధరణ

**న్యూఢిల్లీ :** జనన–మరణ నమోదు విభాగాల సన్నిహిత సమన్వయంతో దేశంలో ఓటర్ల జాబితాలను తాజా సమాచారంతో పునరుద్ధరిస్తామని భారత ఎన్నికల సంఘం చెప్పింది. ఓటర్ల జాబితాలో ఎలాంటి లొసుగులూ లేకుండా స్వచ్ఛంగా ఉండాలన్న విషయంపై చర్చ జరుగుతున్న తరుణంలో ఎన్నికల సంఘం గురువారంనాడు ఈ ప్రకటన చేసింది. అదేవిధంగా ఓటర్ల జాబితాలను ఆధార్‌కార్డులతో అనుసంధానం చేసే ప్రక్రియపై కూడా ఎన్నికల సంఘం నిపుణులు, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ)కు మధ్య సాంకేతికపరమైన సంప్రదింపులు జరుగుతున్నాయనీ పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న నకిలీ ఓటరు కార్డుల బెడద సమస్యను పరిష్కరించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందనీ, ఓటర్లు ఇకముందు వారి వారి పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటుహక్కు ఉపయోగించుకుంటే సరిపోతుందని, వారికి ఎలాంటి సమస్యలూ రాకుండా నియంత్రిస్తామని పేర్కొంది. నిత్యం అందరికీ అందుబాటులో ఉండే ఓటరు జాబితాలను జనన–మరణ నమోదు విభాగాల సన్నిహిత సమన్వయం ద్వారా పటిష్టం చేస్తామని పేర్కొంది. రాజకీయపార్టీలతో ఎన్నికల సంఘం సంప్రదింపులు చేస్తోంది. ముసాయిదా జాబితాలో ఎలాంటి చేర్పులు, మార్పులు, తొలగింపులున్నా న్యాయపరమైన సూత్రాలు, నిబంధనల ప్రకారం ప్రభుత్వం అందరికీ విజ్ఞప్తి చేయడం ద్వారా చేపడుతుందని తెలిపింది. పోలింగ్ అధికారులు, రాష్ట్రలలో ఉన్న ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లాలో ఉన్న ఎన్నికల అధికారులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు దాదాపు 5,000 మంది రాజకీయపార్టీలతో రోజువారీ సమావేశాలు నిర్వహిస్తున్నారనీ, మార్చి 31వ తేదీ లోపు గ్రామస్థాయిలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు ఈ చర్యలు కొనసాగుతున్నాయని ఎన్నికల సంఘం ప్రకటనలో పేర్కొంది. భారత ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా జ్ఞానేశ్ కుమార్ బాధ్యతలు తీసుకున్న నెలరోజుల వ్యవధిలోనే ఎన్నికల సంఘం, బూత్ స్థాయి నుండి ఆఫీసర్ స్థాయి వరకూ యావత్ ఎన్నికల యంత్రాంగాన్నీ ఓటర్ల జాబితాలను పరిశీలించి ప్రోత్సహించి ప్రస్తుత అనుభవాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల స్థాయిలో ఓటర్లకు పూర్తి భరోసా ఇచ్చేందుకు ముందుకు నడిపిస్తున్నారు. రాజకీయ పార్టీలతోపాటు ఈ వ్యవహారాలతో సంబంధం ఉన్న అందరినీ ఈ ప్రక్రియలో సమ్మిళితం చేస్తున్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలి

మహిళా, శిశు సంక్షేమ శాఖపై సవతి తల్లి ప్రేమ తగదు

అంగన్‌వాడీ ఫెడరేషన్ జాతీయ మాజీ కార్యదర్శి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌కు చాలీచాలని నిధులు కేటాయించడం ద్వారా మహిళా, శిశు సంక్షేమం శాఖపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని అల్ ఇండియా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి విమర్శించారు. గోవా, కేరళ రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనం ఇస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం కుడా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పేర్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా పదోన్నతి కల్పించి వేతనం పెంచి ప్రభుత్వ సదుపాయాలను అందించాలి సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో ఫెడరేషన్ నాయకురాలు సాయి ఈశ్వరి అధ్యకతన జరిగింది. సమావేశంలో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమం కోసం పని చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ కృషి అనిర్వచనీయమని, బాలింత మరణాలు, శిశువు మరణాల రేటు తగ్గించి దేశంలో భావిభారత పౌరులను అందిస్తున్న ఘనత వారికే దక్కుతుందన్నారు. కష్ట పడుతున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్‌లకు చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. మార్కెట్‌లో ధరలు నిత్యం పెరుగుతుంటే టీచర్స్‌కు రూ.13 వేలు, హెల్పర్స్‌కు రూ. 7500 ఇవ్వడం అన్యాయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పదోన్నతి సీనియరిటీ ప్రకారం గ్రేస్ మార్కులు పెట్టి పోస్టులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు రూ.18 వేల వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్స్ పేరుతో ప్రభుత్వం మోసం చేస్తున్నదని, అంగన్‌వాడీ, ఆశా, మిడ్‌డే మీల్స, ఎన్‌హెచ్‌ఎం, ఐకెపి, మెప్మాలో వేలాది మంది మహిళలు శ్రమ దోపిడీకి గురవువుతున్నారని, వారి వేతనాలు పెంచి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు పి. ప్రేమ్ పావని, ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి, రాష్ట్ర నాయకులు నరాటి ప్రసాద్, సీతామహాలక్ష్మి , సుమతి తదితరులు పాల్గొన్నారు.

# 'కలప' పర్యావరణ అనుకూలం

సెమినార్‌లో వక్తలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కలప పర్యావరణకు అనుకూలం అని ఆర్టియస్ ఇంటీరియర్ ప్రొడక్ట్స్ ఎండి వివేకాభిలాష్ శర్మ పేర్కొన్నారు. 'వుడ్ ఈజ్ ఫరెవర్ సస్టైనబుల్, రెన్యూవబుల్' (చెక్క ఎన్నటికీ శాశ్వతం పర్యావరణ అనుకూలం పునరుత్పాదకం) అనే అంశం పై కెనడియన్ వుడ్ ఆధ్వర్యంలో ప్రపంచ వుడ్ డే సందర్భంగా సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌లో పలు సంస్థలకు చెందిన యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెల్వెనీర్స్ ఎండి అశోక్ కురియాకోస్ మాట్లాడుతూ.. ఆధునిక ఆర్కిటెక్చర్, డిజైన్లలో పర్యావరణ అనుకూల, పునరుత్పాదక వనరుగా కలప యొక్క ప్రాముఖ్యతను అన్వేషించడానికి హైదరాబాద్ అంతటా ఉన్న ప్రముఖ ఆర్కిటెక్టు, డెవలపర్లు, తయారీదారులు , పరిశ్రమ నిపుణులను ఒకచోట చేర్చడం గొప్ప విషయమన్నారు. సమకాలీన, హైబ్రిడ్ నిర్మాణంలో కలప యొక్క పర్యావరణ అనుకూలత, ప్రయోజనాలు మరియు ఆచరణాత్మక వినియోగాలపై ఈ చర్చ దృష్టి సారించింది, దాని పర్యావరణ ప్రయోజనాలు, దీర్ఘకాలిక మన్నికను వెల్లడించింది.

# ఇస్రోలో ప్రభుత్వ–ప్రైవేటు సహకారం వృద్ధి చెందాలి

వాణిజ్య సాధన వనరులు విస్తరించాలి

సిఐఐ సదస్సులో సోమనాథ్, గోయంకా



**న్యూఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) భవిష్యత్తులో మరింతగా ఆర్థికవృద్ధి సాధించడానికి వాణిజ్యపరమైన వనరులు, సంబంధిత సాధనాలను విస్తారంగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆ సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ ఎస్.సోమనాథ్ అన్నారు. అంతరిక్ష పరిశోధనల ద్వారా మనం సాధించిన సమాచారాన్ని వాణిజ్యపరంగా అన్ని రంగాలకు విస్తరించి వ్యవస్థల పనితీరును సులభతరం చేసుకోవచ్చునన్నారు. రైల్వే ట్రాకులను తనిఖీ చేయడానికి భౌతికపరమైన వనరులపైనే ఎందుకు ఆధారపడాలి? అంతరిక్ష సాంకేతికతను దానికి ఎందుకు వర్తింపజేయకూడదు? ఈ డేటాను ఉపయోగించుకుంటే మన ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు.

భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక సదస్సులో సోమనాథ్‌తో పాటు ఇన్–స్పేస్ ఛైర్మన్ డా.పవన్ గోయంకా కూడా మాట్లాడారు. ప్రభుత్వం, ప్రైవేటురంగం, అంతరిక్ష అంకుర సంస్థల మధ్య బ్రహ్మాండమైన సహకారాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారిద్దరూ అన్నారు. తద్వారా అంతరిక్ష సాంకేతికతను భారతదేశంలో విస్తారంగా ఉన్న వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాగలుగుతామన్నారు. అంతరిక్ష సాంకేతికతకు, వినియోగదారులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని గోయంకా అన్నారు. అంతరిక్ష డేటాను ఉపయోగించి తాము కొత్త కొత్త వాణిజ్య నమూనాలను అభివృద్ధి చేసే విషయాలపై దృష్టి సారించామని చెప్పారు.

ముఖ్యంగా సోమనాథ్ మాట్లాడుతూ, ఇస్రో గణనీయమైన పరివర్తన దిశగా వెళుతోందని, ఐతే వాణిజ్యపరంగా ఆర్థికవృద్ధిని సాధించడానికి అవసరమైన వనరులను అన్నివిధాలుగా సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. అంతరిక్ష సంబంధమైన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన పూర్తి శక్తిసామర్థ్యాలను సమకూర్చుకోవాలంటే కొన్ని మార్పులు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఇస్రో ప్రభుత్వ కార్యక్రమాలను చాలా విస్తృతస్థాయిలో నిర్వహించడానికే కట్టుబడి ఉందని, అందుకు తగ్గట్టుగానే ఇస్రో రూపొంది ఉందని, భారతదేశం అంతరిక్ష సాంకేతికతకు సంబంధించి అన్నికోణాలలో గణనీయమైన ప్రగతి సాధిస్తునప్పటికీ వాణిజ్యపరంగా తన చేతులను బాగా విస్తరించడానికి కొత్త వనరులను సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటివరకూ ఇస్రో సాంకేతికత పూర్తిగా సామాజిక అవసరాల కోసం, ప్రభుత్వ కార్యకలాపాలకోసం పూర్తిగా అంకితమై పని చేస్తోందనీ, ఇక వాణిజ్యపరంగా కూడా కీలకపాత్ర వహించేందుకు కొత్త మార్గాల్లో విస్తరించేందుకు అవసరమైన సాధనాలు, వనరులు సమకూర్చుకోవాలన్నారు. అంతరిక్ష సాంకేతికతను ఆర్థికరంగ అభివృద్ధికి వీలైన, లాభం చేకూర్చే వాణిజ్య అవకాశాలుగా రూపాంతరీకరణ జరగాల్సి ఉందన్నారు. 145 కోట్లమంది జనాభాగల భారతదేశంలో వాణిజ్యపరమైన వనరుల సమకూర్పు చాలా చాలా తక్కువగా ఉందన్నారు. మనం చాలా పరిమితమైన అవసరాలకోసమే పని చేస్తున్నామని, దీని నుండి బయటపడి ఇస్రో తన చేతులను వాణిజ్య విభాగంవైపు బాగా విశాలంగా చాపుకోవాలన్నారు. అందుకు వీలైన సాంకేతక పరిజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. సముద్రతలాన్ని జల్లెడపట్లే ఉపగ్రహాల ద్వారా మనకు మత్స్యపాతశాలలను ఏర్పాటు చేసుకోగల సామర్థ్యం ఉందని, కానీ ఈ సమాచారం పూర్తిగా ప్రభుత్వ మార్గాలలోనే ప్రసారం అవుతోందని, దీనివల్ల ఆర్థికవృద్ధిపై ఎలాంటి ప్రభావం కనిపించిందని ప్రశ్నించారు. ఇస్రో సమాచారాన్ని వాణిజ్యపరంగా విస్తరించాలని, ఎక్కువమందిని తనపరిధిలోకి తీసుకురావాలని అన్నారు. ఉదాహరణకు మత్స్యకారులు తమ వ్యాపారాలను వృద్ధిచేసుకోవడానికి మన ఉపగ్రహాల ద్వారా లభించే లోతైన సముద్రపరమైన సమాచారాన్ని కొనుగోలు చేసుకునే ప్రక్రియను ముందుకు తీసుకురావాలన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

రైల్వే బోర్డు విజిలెన్స్ అధికారి అనిష్ ప్రసాద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే వాటిపై ప్రతి ఒక్కరిరు అవగాహన పెంచుకోవాలని రైల్వే బోర్డు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిష్ ప్రసాద్ సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో సైబర్ నేరస్థుల బారినుండి రక్షణకై అనుసరించవలసిన సులభమైన మార్గాలు అనే అంశంపై జరిగిన కార్యాక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగిస్తూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ మోసగాళ్ల నుండి మన డేటాను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని, దుర్వినియోగాన్ని నివారించడానికి పాస్వర్డ్ భద్రత తప్పనిసరి అని అన్నారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ మాట్లాడుతూ..రైల్వే అధికారులు, సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహనను పెంచడంలో చాలా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మ్యూల్ ఖాతాల నిర్వహణ, డిజిటల్ అరెస్టులు, సైబర్ దాడుల నుండి రక్షణ , క్రిప్టోకరెన్సీలు, నేరాలు, డీప్ వెబ్, సైబర్ చట్టం వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత జీవితాల్లో సైబర్ మోసాల నుండి రక్షణ, పని ప్రదేశంలో డేటా భద్రత మొదలైన వాటిపై కూడా ఆయన అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ జె. వినయన్, ఇతర సీనియర్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.


# వైద్య సేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వైద్య సేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో సరిపడా హెచ్‌ఆర్, పరికరాలు, మౌలిక సదుపాయాలు, డ్రగ్స్, శానిటేషన్‌లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక రూపకల్పనపై హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, టిజిఎంఎస్ఐడిసి ఎం.డి హేమంత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, టివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అన్ని రకాల డయాగ్నస్టిక్ సేవలు పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. టూల్స్ అండ్ ప్లాంట్స్ నిర్వహణ కోసం అన్ని హాస్పిటల్స్ సూపరింటెండెంట్లకు నిధుల కేటాయించాలని చెప్పారు. గత సంవత్సర కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులలో ఐపి, ఒపి, ఇతర సర్జరీల సంఖ్య పెరిగిందన్నారు. అన్ని ఆసుపత్రులలో సరిపడా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని త్వరలోనే నియమిస్తామని చెప్పారు. వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తామని మంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పల్లె దవాఖాన, పట్టణ దవాఖాన, పిహెచ్‌సి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిర్ధారించిన అన్ని రకాల వైద్య సేవలు విధిగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు తప్పనిసరిగా విధుల సమయంలో ఉండాలన్నారు.


# నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దు

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని, నకిలీ విత్తనాలతో భూమి కాలుష్యానికి గురైతుందని మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట ఓఆర్‌ఆర్ వద్ద ఎస్ఒటి పోలీసులు డిసిఎం వాహనంలో తరలిస్తున్న నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాలకు చెందిన సొల్లు సురేష్ అనే వ్యక్తి నరేష్ అనే వ్యక్తితో డిసిఎం కిరాయి మాట్లాడుకుని కర్ణాటకు నుంచి మంచిర్యాలకు పత్తి విత్తనాలను తరలించడానికి రూ. 50 వేలు బేరం కుదుర్చుకున్నారు. నరేష్, కోస్తాంగికి చెందిన రమణ ఆలియాస్ రామయ్య టిఎస్19టి3447 డిసిఎం వాహానంలో 3750 కిలోల నకిలీ విత్తనాలను కర్ణాటక కొస్తాంగి నుంచి మంచిర్యాలకు తరలించడానికి బయల్దేరారు. మార్గమధ్యంలో శామీర్‌పేట ఓఆర్‌ఆర్ బ్రిడ్జ్ వద్ద పోలీసులు డిసిఎంను తనిఖీ చేయగా నకిలీ విత్తనాలుగా గుర్తించి వాహానాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సురేష్ అనే వ్యక్తి పరారిలో ఉన్నట్లు డిసిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒటి డిసిపి శ్రీనివాస్, అడిశనల్ డిసిపి పురుషోత్తం, ఎసిపి రాములు, సిఐలు శ్రీనాథ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, డిఐ గంగాధర్, ఎఐ రమేష్ ఎస్ఐలు దశరథ, హారిక సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పరిగి :** పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో 5నూతన బస్సులను డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పరిగి నియోజకవర్గం లోని పలు గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ,బీసీ రిజర్వేషన్లు 42శాతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. కాంగ్రెస్ ద్వారా అన్ని వర్గాలను అభివృద్ధిలోకి తెస్తుందన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వాలు చేయని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని అన్నారు. వికారాబాద్ పరిగి కృష్ణా రైల్వే లైన్ సర్వే పూర్తయిందని తెలిపారు. 42 శాతంతో బీసీలకు రాజకీయంగా ఆర్థికంగా, సామాజికంగా లబ్ది పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిధుల ప్రతిపాదన లేకపోవడం దురదృష్టకరం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్భాటంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3,04,965 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు నిధుల ప్రతిపాదన లేకపోవడం దురదృష్టకరమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య అన్నారు. పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింపజేసి, 150 రోజుల పని కలిగిస్తామని సామాజిక పెన్షన్లు రూ.2000 నుండి రూ.4 వేలకు పెంచుతామని, ఇండ్ల స్థలాలు లేని పేదలకు భూములు కొని ఇస్తామని, కౌలు రైతులకు రూ.15000 రైతు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో అమలు గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ బడ్జెట్‌ను సవరించి 6 గ్యారంటీల అమలుకు పేదల సంక్షేమానికి బడ్జెట్ ప్రతిపాదనల పొందుపర్చాలని కోరారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌లో సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు నిధులు పెంచాలన్నారు. గృహ నిర్మాణానికి మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో లక్షలాదిమంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, బడ్జెట్‌లో వారి ప్రస్తావనే లేదన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని, 150 రోజులు పనులు కల్పించి, రోజుకు రూ.400 వేతనం ఇవ్వాలని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీలన్నారు. బడ్జెట్‌లో సవరణ చేసి వ్యవసాయ కార్మికులకు న్యాయం జరిగేలా ప్రతిపాదనలు ప్రవేశపెట్టాలని కలకొండ కాంతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మాదిగలు మనువాద జెండా మోయబోరు : సతీష్ మాదిగ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఎట్టిపరిస్థితుల్లో తెలంగాణ మాదిగలు మనువాద జెండా మోయబోరని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు జనరల్ సెక్రటరీ దేవని సతీష్ మాదిగ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టులో బిజెపి అఫిడ విట్ వేసిందని మందకృష్ణ మాట్లాడటం వెనుక కుట్ర దాగి ఉన్నదని ఆరోపించారు. మాదిగలను బిజెపి వైపు మళ్లించేందుకు ఆయన ప్రయ్నతిస్తున్నారని పేర్కొన్నారు. మందకృష్ణ వెంటనే బిజెపి వేసిన అఫిడవిట్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తెచ్చేందుకు మందకృష్ణ తహతహలాడుతున్నారని పేర్కొన్నారు. 1997 నుంచే మందకృష్ణకు కిషన్‌రెడ్డి, చంద్రబాబుతో సోపతి ఉన్నదని తెలిపారు. బిజెపి వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని నిరూపించుకోవడానికి ముందు తమ 18 పాలిత రాష్ట్రాల్లో ఎస్‌సి వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. 30 ఏండ్ల ఉద్యమం ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సిలను ఎబిసిడిలను వర్గీకరించిందని తెలిపారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ పొలడుగు శ్రీనివాస్, అల్లారం రత్నయ్య, కొక్కెర భూమన్న, జున్ను జయరాజ్ , పెదన్న, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసానికి అంగవైకల్యం అడ్డురాదు : ఎమ్మెల్యే సబితా



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఆత్మవిశ్వాసానికి అంగవైకల్యం అడ్డురాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మీర్‌పేట్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రయాస్ ఇండియా చారిటీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్యే సబితారెడ్డి కప్పు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మవిశ్వాసానికి అంగవైకల్యం అడురాదని సాధించాలనే పట్టుదల ఉంటే ఎంతటి వారైనా పటా పంచలు అయిపోతారని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పేద, బడుగు బలహీనవర్గాల ప్రజల పార్టీ కాంగ్రెస్ : పారిజాత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల పార్టీ అని టీపిసిసి ప్రధాన కార్యధర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పోరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీలో బిసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, పిసిసి నాయకులు ఎల్మేటి అమరేందర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్‌లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు చిగిరింత దయాసాగర్‌రెడ్డి, సుభాన్‌యాదవ్, బలింగని జంగయ్య, ఎర్ర జైహింద్, రాళ్లగుడెం శ్రీనివాస్‌రెడ్డి, క్యారగారి శ్రీధర్, పుట్టగళ్ళ జగన్, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు అండ

ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సిఎం సహాయ నిధి పేదలకు అండ అని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. గురువారం కొత్తపేటలోని తన నివాసంలో బేయిన్ స్ట్రోక్‌తో బాదపడుతున్న దిల్‌షుఖ్‌నగర్ గణేష్‌పురి కాలనీకి చెందిన మిలాన్‌కు రూ. 2.25 లక్షల సిఎం సహాయనిధిని అందించారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గారపు శరత్‌చంద్ర పాల్గొన్నారు.

## వడగాలులతో అప్రమత్తంగా ఉండాలి

హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వడగాలుల పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రావంతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ క్రమంగా ఎండల తీవ్రత పెరుగుతుందని, దాంతో ప్రజలు ఇళ్ళల్లో నుండి బయటకు వచ్చేందుకు తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ ముస్తకిన్, హెల్త్ సూపర్ వైజర్లు చంద్రకళ, శ్రీరామ, స్టాఫ్ నర్సులు ఫకీర్ అమ్మ, ల్యాబ్ టెక్నిషియన్ శివకుమార్‌తోపాటు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్దపీట : విశాల



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలో అధ్యక్షుడు వీరేశం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మొండిగైరెల్లి గ్రామ రైతులకు అండగా ఉంటాం..: మంచిరెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** మొండిగౌరెల్లి గ్రామ రైతులకు అండగా ఉంటానని బిఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన రైతులు మాజీ శాసన సభ్యులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్తు వెంకటరమణారెడ్డి,. కర్నాటి రమేశ గౌడ్, మేకల యాదగిరిరెడ్డి, అంజయ్య యాదవ్, బండిమీది కృష్ణ, తాండ్ర రవింధర్, సంగెం రవి, సందిప్‌రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పాండు, జంగారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ఎట్టి యాదయ్య, కృష్ణయ్య పాల్గోన్నారు.

## ‘వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలి’

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వడ్డెర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని భారతీయ వడ్డెర (ఒడిఇ) సమాజ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డా.వెంకటేశ్ మౌర్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య కోరారు. ఇందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సంఘం నేతలు సంపంగి ప్రభాకర్, దేరింగుల రూప మహేశ్వరి, కొమ్మరాజుల శేఖర్, దేరంగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి ఉద్యోగులకు సులభతర ఆరోగ్య సేవలు



ఇడి మయాంక్ మిట్టల్

మెడ్ ఫ్లాష్ యాప్ వినియోగంపై అవగాహన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలిలో హెల్త్ కార్డు కలిగిన ఉద్యోగులు, పెన్షనర్లకు సులభతరమైన ఆరోగ్య సేవలు అందించడానికి రూపొందించిన మెడ్ ఫ్లాష్ అప్లికేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జలమండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇడి మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ బోర్డు ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం ఈ యాప్ తీసుకొచ్చామన్నారు. వైద్య సేవల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగకుండా యాప్ ద్వారా సేవలు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో యాప్‌ను ఉపయోగించి అంబులెన్స్ సేవలు సైతం పొందవచ్చన్నారు. యాప్‌ను ఎండి అశోక్ రెడ్డి ఈ నెల 10న ప్రారంభించారు. కార్యక్రమంలో పి అండ్ ఎసిజిఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రావిడెన్స్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెండ్ జ్యోతి బాల పాల్గొన్నారు.

### జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామకం

జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామక ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగా మరణించిన ముగ్గురి ఉద్యోగుల వారసులకు.. వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి కల్పించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఇడి మయాంక్ మిట్టల్ అందచేశారు.



## కోరిన వెంటనే ఫాగింగ్






దోమల నివాణకు జిహెచ్ఎంసి వినూత్న ప్రయోగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసిలో దోమల నివారణకు చేసే ఫాగింగ్ ఇప్పుడు డిజిటలైజ్ చేశారు. ఫాగింగ్ జరిగే ప్రాంతాలు, సమయం వృధా కాకుండా సమస్యల ఆధారంగా పరిష్కరించడానికి వీలుగా పౌరులే ఫాగింగ్ నిర్వహించాలని కోరితే జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ‘మై జిహెచ్ఎంసి’ మొబైల్ యాప్‌లో ఫాగింగ్ రిక్వెస్ట్ పెట్టేందుకు వీలుగా వెసులు బాటు కల్పించారు. ఎక్కడైతే ప్రధానంగా దోమల బెడద ఉంటుందో అక్కడ ఏ పౌరుడైన మై జిహెచ్ఎంసి యాప్ లాగిన్ చేసి రిక్వెస్ట్ చేయవచ్చు. వారి లొకేషన్, రిక్వెస్ట్ ఆటోమేటిక్‌గా ఆఫీసర్‌కి చేరుతుంది. ఎంటమలాజిస్ట్ దాన్ని ఫాగింగ్ వర్కర్‌కి అసైన్ చేస్తారు. ఫాగింగ్ చేస్తున్న ఫొటో లాటిట్యూడ్ లాంగిట్యూడ్‌తో సహా అప్‌లోడ్ చేసి పరిష్కారం అయిపోయిందని అప్డేట్ చేస్తారు. జిహెచ్ఎంసిలో ఉన్న ఫాగింగ్ వర్కర్స్‌కు తగినన్ని స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. ఒకసారి రిక్వెస్ట్ చేసిన తర్వాత 100 మీటర్ల ప్రాంతం వరకు, వారం వరకు ఆ ప్రాంతం నుంచి రిక్వెస్ట్ రాకుండా నిరోధిస్తోంది. ఈ ఫాగింగ్ ఆన్ రిక్వెస్ట్ ఫీచర్‌ని మై జిహెచ్ఎంసి యాప్‌లో మొదటగా ప్రయోగాత్మకంగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ముందుగా వినియోగించి, ఫలితాలకు అనుగుణంగా మొత్తం జిహెచ్ఎంసికి విస్తరించనున్నారు.

## జాటోత్ ఠాను నాయక్ వర్ధంతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాను నాయక్ వర్ధంతిని గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో బాలాపూర్ మండలం లెనిన్‌నగర్ సిపిఐ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ నాయక్, గిరిజన సమాఖ్య బాలాపూర్ మండల అధ్యక్షులు జాటోత్ రెడ్యా నాయక్, బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి రామావత్ చత్రు నాయక్, కేతావత్ శ్రీను నాయక్, వడిత్య దత్తు నాయక్, జాటో సోమ్లా నాయక్,జాటోత్ రాంజీ నాయక్, కేతావత్ రఘునాయక్, శీను, శంకర్, వెంకటయ్య, భీమయ్య, కేతావత్ గోవింద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

టెన్త్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

రంగారెడ్డి డిఇఒ సుశీందర్‌రావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పది విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దు.. ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలనీ, అందుకు తల్లిదండ్రులు తమ పిల్లలకు మానసిక మద్దతు అందించి ప్రోత్సహించాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుశీందర్‌రావు అన్నారు. పదో పరీక్షల ఏర్పాట్లపై జిల్లా విద్యా శాఖ అధికారి గురువారం విలేకరులతో మాట్లాడారు. పదో పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 249 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. 52,794 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. 249 మంది చీఫ్ సూపరింటిండెంట్లు , పదిమంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పరీక్షలకు నియమించినట్టు తెలిపారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులను అర గంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, నిర్దేశిత 9:35 నిముషాల తర్వాత వచ్చే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తెలిపారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రశ్నాపత్రాల నిల్వ కోసం 37 కేంద్రాలు ఎంపిక చేసినట్టు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించేందుకు 10 రూట్లను ఎంపిక చేశామన్నారు. ఎంఇఒ స్థాయిలోని 10 మంది అధికారులతో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పరీక్ష కేంద్రా ల్లోనూ సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు. సమీపంలోని జీరాక్స్ సెంటర్లను మూసి వేయాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత చరిత్ర మరువదు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం చరిత్ర మరచిపోదనే విషయాన్ని తెలంగాణ ప్రజలందరు గుర్తు పెట్టుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. దండోరా డప్పు చప్పుళ్లల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. అక్కడి నుండి క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకొని మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అంటుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధ కల్పించే ప్రయత్నం ఫలించిందని పేర్కొన్నారు. బిసిలను, ఎస్సీలను కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకున్నారే తప్పా వారి శ్రేయస్సు కోసం పాటు పడ్డ పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో చేవెళ్ల బహిరంగ సభలో రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖార్గేలు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో అమలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ తాలుకా నేతలు బాదేపల్లి సిద్దార్థ, కొమ్ము కృష్ణ, కర్రోళ్ల సురేందర్, జాంగారి రవి, ఎర్రోళ్ల జగన్, సింగపాగ అనిల్‌కుమార్, లింగారం యాదయ్య పాల్గొన్నారు.





### రైతు పక్షపాతిగా నిలుస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

**ఫరూఖ్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌కు నిధుల కేటాయింపు, పరిపాలన అనుమతులుపై స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ రైతు పక్షపాతిగా నిలుస్తున్నారని ఫరూఖ్‌నగర్ మాజీ జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు స్వీట్లు తినిపించి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం ఎన్నో ఏళ్ల కలను సకారం చేసిన వ్యక్తులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మొదటి వరుసలో ఉంటారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నీటి పారుదలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు పాలమూరు, నల్గొండ జిల్లాల రైతులకు సాగునీరు, తాగునీరు పుష్కలంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం అనేక ఎళ్ల పాటు ఉద్యమాలు చేశారని, వాటి పోరాట ఫలితంగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు.

## డబుల్ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**ప్రజాపక్షం/గండిపేట :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో నిశంషాబాద్ మండలంలోని అమిదుల్లా నగర్,బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని కిస్మత్పూర్‌లో నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు కేటాయింపు జరిగిన నేటికీ ఇండ్లకు సంబంధించిన పట్టాలు జారీ చేయలేదు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక చొరవతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి గురువారం అమిదుల్లా నగర్ లో 20 మందికి, కిస్మాతపూర్ లో 49 మందికి లబ్ధిదారులకు ఆర్డీవో వెంకటరెడ్డి ,శంషాబాద్ తాసిల్దార్ రవీంద్ర దత్తు, గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర లా తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పట్టాలు, ఇంటి తాళాలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిపోయిన లబ్ధిదారులకు పట్టాలు అందజేయడం వలన వారికి ఎన్నో ఏళ్ల కల నెరవేరిందన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుణ్యమా అని మాకు సొంత ఇంటి లోకి ప్రవేశిస్తున్నామని సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..



## అసమర్థతతోనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు : బిఆర్ఎస్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రొటోకాల్ పేరుతో ఎల్బీనగర్ నియోజకవర్గంలో రాజకీయ రగడ చేయాలని దురుద్దేశంతో బిజెపి ఎల్బీనగర్ కార్పొరేటర్లు పన్నగం పన్నారని, రాజకీయంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఎదుర్కోనలేకనే దొడ్డిదారినిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కుమ్మకై నియోజకవర్గ ప్రజలకు తప్పుదారి పట్టించే విధంగా బిజెపి కార్పొరేటర్లు ప్రయత్నిస్తున్నారని బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు మండిపడ్డారు. గురువారం వనస్థలిపురం డివిజన లోని ప్రశాంత్ నగర్‌లోని మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రమావత్ పద్మనాయక్, సామా తిరుమలరెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి లు మాట్లాడుతూ కావాలనే బిఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై బురద జల్లాలనే నేపతంతో బిజెపి కార్పొరేటర్లు ప్రోటోకాల్‌ను అడ్డుపెట్టుకుని ప్రజలకు పక్కదారి పట్టించే విధంగా యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎల్బీనగర్‌లో రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులతో కుమ్మకై మధుయాష్కీ గౌడ్ డైరెక్షన్‌తో నియోజకవర్గంలో ప్రోటోకాల్ పేరు చెప్పి రాజకీయంగా ఎదగాలని చూడడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. బిజెపి పార్టీ కార్పొరేటర్లు మధుయాష్కీతో సఖ్యాతగా ఉంటూ బిఆర్ఎస్‌ను బదనాం చేయడానికి కుట్ర చేస్తున్నారని వాటిని తిప్పికొట్టే రోజులు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ శ్రీనివాస్ నాయక్, చెరుకు ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ విమర్శించారు. గురువారం హయత్‌నగర్ మండల ఎంఇఒ కార్యాలయం ముందు బడ్జెట్‌లో విద్యారంగానికి 7.57 శాతం నిధులు మంజూరు చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మొత్తం బడ్జెట్ రూ.3,04,965 కోట్లు కాగా, విద్యారంగానికి కేవలం రూ.23,108 కోట్లు మాత్రమే కేటాయించరన్నారు. మొత్తం బడ్జెట్‌లో 7.57 శాతం మాత్రమే. ఈ కేటాయింపును విద్యార్థి లోకానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, హామీని విస్మరించి 7.57 శాతం నిధులతో సరిపెట్టడం విద్యార్థులను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. ప్రభుత్వం హామీలను మరిచిపోయిందన్నారు. విద్యారంగం అభివృద్ధి లేకుండా రాష్ట్ర ఎలా ముందుకు సాగుతుందని ఆయన ప్రశ్నించారు. విద్యారంగానికి కనీసం 30శాతం నిధులు కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15నెలలు పూర్తయినప్పటికీ, విద్యారంగంలో సమస్యలు యధాతథంగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల నియామకాల ఆలస్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

### విద్యాశాఖకు లేని మంత్రి

ప్రజాప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా నేటికి విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించకపోవడం దారుణమని పుట్టా లక్ష్మణ్ విమర్శించారు. మంత్రి లేకపోవడంతో విద్యారంగంలో నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయన్నారు. ఇది పాలనాసరమైన వైఫల్యాన్ని సూచిస్తోందన్నారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించి, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. విద్యారంగం అభివృద్ధి కోసం బడ్జెట్‌లో కనీసం 30శాతం నిధులు కేటాయించాలని, విద్యార్థుల హక్కులని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో విద్యా సంఘాలను అణిచివేయడానికి ప్రభుత్వం కుట్రపన్నుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికయిన విద్యారంగానికి నిధులు పెంచాలన్నారు. విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరిం చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్‌రంగారెడ్డి కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, జిల్లా గర్ల్స్ కన్వీనర్ కాటి శ్రావణీ, బొంగు అరుణ్ కుమార్‌గౌడ్, పత్లావత్ వినోద్ నాయక్, భూక్యా వినోద్, పార్వతి, ఉపేందర్, శివ, భాను ప్రకాష్, కార్తీక్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు : కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు సంబంధించిఅన్ని ఏర్పాటు చేశామని , మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అత్యంత జాగ్రత్తగా ఈ పరీక్షలను నిర్వహించాలని ,ఎట్టి పరిస్థితుల్లో కూడా పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనమతించకూడదని జిల్లా కలెక్టర్ తెలిపారు.కలెక్టర్ కార్యాలయం నుండి తాహసీల్దార్ ,ఎంపిడిఓ ,ఎంఈఓలతో పదవ రతగతి పరీక్షల ఏర్పాట్లపై జూమ్ మీటింటింట్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ అమలు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రలు ఉన్నా దగ్గర జిరాక్స్ జెంటర్లును ముయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ,విద్యశాఖ అధికారి రేణుకదేవి తదితరులు పాల్గోన్నారు.

## గోలి శ్యామలకు రూ.25వేలు బహూకరణ




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సముద్రంలో 150 కిలో మీటర్లు ఈది ప్రయాణించిన 52 ఏళ్ల మహిళకు మర్రి లక్ష్మారెడ్డి విద్యా సంస్థలు గురువారం రూ.25వేలు నగదు బహూకరించారు. సామర్లకోట ప్రాంతానికి చెందిన భారత స్విమ్మర్ గోలి శ్యామలకు మర్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిలు తమ కార్యాలయంలో చెక్‌ను అందించారు. 52ఏళ్ల వయస్సులో మహిళ సముద్రంలో ఈత కొట్టటం ఆదర్శనీయమన్నారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన మంత్రి

**ప్రజాపక్షం/అల్వాల్ :** నియోజకవర్గం అభివృద్ధి తమ లక్ష్యమని ఏడవ వార్డు ఆశ ఆఫీసర్స్ కాలనీ నుండి గాంధీనగర్ వరకు ఒక కోటి 1.5 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే గణేష్ తో కలిసి రవాణా బిసి సంక్షేమ శాఖ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పనులను శంకుస్థాపన చేశారు. కంటోన్మెంట్ బోర్డు కేంద్ర ప్రభుత్వంలో ఉండడం ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధిపై దృష్టి సారించిందని అభివృద్ధికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని కంటోన్మెంట్ ప్రాంతంలో నీటి సమస్యను తీర్చడానికి ముఖ్యమంత్రి సహాయంతో జిహెచ్ ఎంసి వాటర్ బోర్డ్ 5.9 ఎంజీడి వాటర్ సప్లైని 6.9 కి పెంచిన స్టోరేజ్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ సరిగ్గా లేదని డిఫన్స్ మరియు సివిల్ ఏవియేషన్ భూములలో పేదలకు పట్టాలు ఇప్పించాలని మహిళలకు వ్యాపారవేత్తలుగా మార్చడానికి స్వయం ఉపాధి కల్పించడానికి ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకోసం ఐదు కోట్ల రూపాయల నిధులను కేటాయించడం జరుగుతుంది. ఈ ప్రాంత ప్రజల కోసం అనేక సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ముందుంటామని జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్, అధికారులకు ఆదేశిస్తున్నాము. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కంటోన్మెంట్ బోర్డ్ జాయింట్ సిఇఓ పల్లవి, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్, కంటోన్మెంట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, స్థానిక కాంగ్రెస్ నాయకులు సరిత, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ఎలివేటర్ కారిడార్ నిర్మాణం కోసం గ్రామసభ

**ప్రజాపక్షం/అల్వాల్ :**ఎలివేటర్ కారిడార్ నిర్మాణంకోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. అల్వాల్ లోతుకుంట ఐటిఐ గ్రౌండ్ సిద్ధార్థ వినాయక విద్యానికేతన్ కళాశాలలోని అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పెషల్ ఆఫీసర్ మనోహర్ ఎస్‌డిసి శంకర్, ఎమ్మార్వో రాములు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంకోసం భూసేకరణ పునరావాస, పునర్ ఉపాధి కల్పన కొరకు ఆల్వాల్ లోతుకుంట వాసులతో గ్రామసభ నిర్వహించారు. భూములు కోల్పోతున్న వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన నష్టపరిహారం కల్పించే విధంగా కృషి చేస్తామని, ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేస్తుందని దీంట్లో భయపడే ప్రసక్తి లేదని అధికారులు వెల్లడించారు.

## మురుగునీటి సమస్య పరిష్కరిస్తాం


**ప్రజాపక్షం/అల్వాల్ :** పేమ్ నగర్ కాలనీ సూర్య నగర్ కాలనీ హరిజన బస్తీలలో మురుగునీరు నిల్వ ఉండడంతో కాలనీలో దుర్గంధం వెదజల్లడంతో ఇబ్బందులకు గురవుతున్నామని కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కి స్థానిక ప్రజలు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ, డివిజన్ లోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి వివిధ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తామని కార్పొరేటర్ అన్నారు. అదే విధంగా అధికారులతో కలిసి వివిధ ప్రాంతాలను పరిశీలించారు. త్వరలోనే రైల్వే అధికారులతో సంప్రదించి రైల్వే ట్రాక్ పక్కన మురుగునీరు తొలగించే విధంగా



కృషి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం సాంబయ్య, డిఈ రఘు, విగ్నేష్, స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, వెంకటేష్, దేవేందర్, రాములు,మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలి

**ప్రజాపక్షం/దుండిగల్ :** సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా కిరాణా షాపులు హోటల్స్, రెస్టారెంట్లు లలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ (120 మైక్రోన్) కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ ను వాడవద్దని కమీషనర్ ఎన్.వేంకటేశ్వర్ నాయక్ అన్నారు. ముఖ్యంగా సింగల్ యూస్ ప్లాస్టిక్ వా డే, కిరాణా షాపులు, హోటల్స్, చికెన్ మటన్ దుకాణాలపై రైడ్ చేసి సింగి ల్ యూస్ ప్లాస్టిక్ అమ్మేవారికి పెనాల్టీ విధించడం జరుగుతుందని మున్సిపల్ పరిధిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడే వారికీ 26,500/– పెనాలిటి విధించారు. అదే విధంగా ప్లాస్టిక్ బదులు అందరూ జ్యూటు బ్యాగులు, చేతి కర్ర సంచులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.లక్ష్మయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ కె.అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి.సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి, స్పీకర్ చిత్ర పటాలకు పాలాభిషేకం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వికారాబాద్ పట్టణంలో ఎన్‌టిఆర్ చౌరస్తాలో వికారాబాద్ ఎస్సి పట్టణ అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవంగా ఆమోదం చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, మల్లేశం, నగేష్ బుచ్చయ్య, సుధాకర్‌రెడ్డి, రెడ్యానాయక్ తదితరులు పాల్గోన్నారు.



# పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ లోని అనంతగిరి హరిత రిసార్టులో మూడురోజులు పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మెజార్టీ తీసుకువచ్చి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడానికి మనమందరం కష్టపడాలి అని అన్నారు. రాజ్యంగంలో 5,6 షెడ్యుల్ లను ప్రత్యేకంగా గిరిజనలకు, ఆదివాసీలకు కేటాయించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ గిరిజన హక్కులను కట్టబెట్టింది. రిజర్వేషన్లు ఉపయోగించుకొని నేడు గిరిజనులు విద్యా,ఉద్యోగ రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. అంటే దానికి కారణం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం కల్పించిన రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లు కారణం అని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో గిరిజన పథకంలో ట్రైకార్ ద్వారా నిరుద్యోగ గిరిజన యువకులకు ఉపాధి కల్పించడానికి ఈ ఒక్క ఏడాదికి 1360కోట్ల రూపాయలు కేటాయించారు.

ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, విక్రాంత్ బురియా, రాహుల్ బాల్‌జి తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు సంతోష , ధారసింగ్ సుధాకర్‌రెడ్డి, కిషన్ నాయక్ , తదితరులు పాల్గోన్నారు.

**డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణః** వికారాబాద్ జిల్లా తెలంగాణ పంచాయతీ కార్యదర్శిల సెంట్రల్ ఫోరం డైరీ, క్యాలెండర్, స్టిక్కర్ తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ అవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవో వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శివకుమార్, అజ్మత్, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం జిల్లా అధ్యక్షులు కె.మధుకార్‌రెడ్డి, ఎన్ఎం రామ్, విహర్, మల్లేష్‌గౌడ్, రమేష్, వేమరెడ్డి, మల్లేశం, కృష్ణయ్య, విశ్వతేజ, మారుతి, కార్తీక్ తదితరుల పాల్గోన్నారు.

## తైబజార్‌లో తప్పుడు లెక్కలు...




**ప్రజాపక్షం/దుండిగల్:** మున్సిపల్ వారం ఆదాయం వేళల్లో, వసూళ్ల దందా లక్ష్యల్లో దుండిగల్ మున్సిపాలిటీ లో తైబజార్ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళుతుంది. వసూల్ చేసే డబ్బులకు మున్సిపల్ లెక్కలకు పొంతన లేకుండా పోవడం పలు విమర్శలకు తావిస్తుంది. తైబజార్ వేలంపాట నిర్వహణకు అవకాశం ఉన్నా, ఎవరి స్వలాభం కోసం వేలంపాట నిర్వహించడం లేదన్నది స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షాప్ ల లెక్కలు, నిత్యం తైబజార్ ద్వారా వచ్చే లెక్కలు మున్సిపాలిటీకి చెల్లించే లెక్కలకు పొంతన లేకుండా పోతుంది. వచ్చే సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళుతుంది. ఎవరికి ఎంత వాటా అనే అనుమానాలు కలుగుతున్నాయి. దుండిగల్ మున్సిపాలిటీలో ఉన్న మార్కెట్లు, ఇతర విక్రయ షాప్ లు, వారాంతపు సంతల ద్వారా తైబజార్ వసూల్ చేస్తారు. కూరగాయల దుకాణాన్ని బట్టి 20 నుండి 50 రూపాయలు మార్కెట్లో నిర్వహించే ఇతర షాప్ లకు వాటి నిర్వహణను బట్టి వసూల్ చేస్తారు. వసూళ్లకోసం ఒక శానిటరీ ఇన్స్పెక్టర్, ఒక జవాన్ కు బాధ్యతలు అప్పగించారు. ఇద్దరు విధులు నిర్వహించాల్సి ఉన్నా పెత్తనం జవాన్ ఉండడం అన్నీ తానై వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తుంది. ప్రతి దుకాణ దారునికి ఆన్ లైన్ రసీదు ఇవ్వాల్సి ఉంటుంది. రసీదులు ఇవ్వడంలోనే తప్పులు తడకలు దొర్లుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ లో 6 గ్రామాలు ఉండగా వారాంతపు సంతలే సుమారు 25 వరకు నిర్వహిస్తున్నారు. ఒక్కో సంతలో సుమారు 150 నుండి 180 కూరగాయ లు ఇతర దుకాణాలు ఉంటాయి. 150 దుకాణా ల ద్వారా ఒక్కో దుకాణం నుండి 20 రూపాయ లు మాత్రమే వసూల్ చేస్తున్నారు. అనుకున్నా వారంలో 75 వేల వరకు మున్సిపాలిటీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే నెలకు సుమారు 3 లక్షల 75 వేల వరకు వాసూలు అవుతున్నాయి. మార్కెట్లలోని ఇతర షాప్‌ల నుండి వచ్చే ఆదాయం వేరు, వచ్చిన సొమ్మును ఏ రోజుకు ఆ రోజు మున్సిపల్ కార్యాలయంలో జమ చేయాల్సి ఉంటుంది. వారంలో 35 వేల లోపు అనగా సుమారు లక్ష 87 వేల, ఐదు వందలు మాత్రమే చెల్లిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చే సొమ్ములో ఎవరి వాటా ఎంత అనే అనుమానాలు కలుగుతున్నాయి.

**దుండిగల్ తైబజార్ వేలంపాటలో కాలయాపన** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ, నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్‌లలో ఇప్పటికే తైబజార్ వేలంపాటలు ముగిశాయి. వేలం పాట అనంతరం తైబజార్‌లు ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళుతాయి. మున్సిపల్ చట్టానికి లోబడి కూరగాయల దుకాణాల వద్ద వసూల్ చేయాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దుండిగల్ మున్సిపాలిటీలో తైబజార్ వేలంపాట నిర్వహించకపోవడం పలు ఆరోపణలు తావిస్తుంది. ఎవరు స్వలాభం కోసం వేలంపాట వేయడం లేదనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

## ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఎంపి ఈటెల జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి దేవాలయంలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఎంపి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి స్వీటులు పంచి, మల్కాజిగిరి చౌరాస్తాలో కేక్ కట్ చేసారు. బిజెపి శ్రేణలు సోమా శ్రీనివాస్, సునీల్ యాదవ్, సాయిబాబా,కిరణ్, నందుయాదవ్, బాలచందర్, వేణు, మురళి గౌడ్, ఆవుల వినోద్, ఉడుత నవీన్, అభిషేక్ లతో కల్సి కార్పొరేటర్ ఈటెల నివాసానికి వెళ్ళి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గౌతంనగర్ చౌరాస్తాలో కేక్ కట్ చేసిన కార్యక్రమంలో వానంసెట్టి శ్రీనివాస్, అమర్, స్వర్ణలత, నందు యాదవ్, మురళి గౌడ్, బాలు తదితరులు పాల్గొన్నారు.మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీత ఆధ్వర్యంలో దీనదయాల్ నగర్‌లోని వృద్ధాశ్రమంలో పండ్లు,ఫలహారాలు పంచి ఎంపి ఈటెల జన్మదిన వేడుకలను జరిపారు. కట్టమైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన కార్పొరేటర్ వినాయకనగర్‌లో శివగౌడ్, లింగారావు, ప్రసాద్ చౌదరి, శాంతారం, సాయిబాబు, దేవేందర్ తదితరులతో కల్సి కేక్ కట్ చేసారు.



**నాగారంలోః** మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలసి ఈటల రాజేందర్‌లతో కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటి, వాణిజ్య పన్నులు వంద శాతం వసూలు

### - డీఎల్‌పిఒ సాంబిరెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇంటి, వాణిజ్య పన్నులను సకాలంలో పూర్తిస్థాయిలో వసూలు చేయాలని, వచ్చేది వేసవికాలం కావడంతో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పిఒ సాంబిరెడ్డి అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో గ్రామపంచాయతి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా సమీప రైతుల బోర్ మోటార్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలోని పాత బోర్‌లను రిపేర్ చేయించాలని, హ్యాండ్ పంపులను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. నర్సరీలోని మొక్కలు వంద శాతం బతికేటట్లు కాపాడాలని సూచించారు. తడి, పొడి చెత్తను ఇంటి దగ్గర వేర్వేరుగా సేకరించి వర్మి కంపోస్టును తయారు చేయాలని, వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలకు ఈ ఎరువు వాడాలన్నారు. మిగిలిన ఎరువులను అమ్మి గ్రామపంచాయతికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు పోగుచేసి అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉర్రూతలూగించిన మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ 'ఏకత్వ 2025'



### హాజరైన ఎమ్మెల్యే కెపి వివేకానంద, సినీ హీరో విజయ్ దేవరకొండ

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారంలోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీట్ ఆధ్వర్యంలో ఏకత్వ 2025 వార్షికోత్సవ వేడుకలు ఉర్రూతలూగించాయి. యువత కేరింతల మధ్య జోరుగా, హుషారుగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద, సినీహీరో విజయ్ దేవరకొండలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదల, స్వయంకృషితో మల్లారెడ్డి ఎదిగారని, నేటి యువతరానికి ఎంతో ఆదర్శమని అన్నారు. విద్యార్థులు విద్య తో పాటు అన్ని రంగాల్లో రాణించేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. మల్లారెడ్డి విశ్వ విద్యాపీట్ సంస్థ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, విద్యా సంస్థకు మంచిపేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని అన్నా రు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి, కార్పొరేటర్ సత్యనారాయణ, నాయకులు సురేశ్ రెడ్డి, మన్నెరాజు, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.



# పేదలకు అండగా ప్రజాపాలన ప్రభుత్వం

### కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

**ప్రజాపక్షం/కొడంగల్ :**నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ఉంటుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ పట్టణంలోని కడ ప్రత్యేక కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజురైంది. అందుకు సంబంధించిన చెక్కులను నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అర్హులైన లబ్దిదారులకు అందజేశారు. నియోజకవర్గంలో దాదాపు 100 మందికి చెక్కులను అందజేసినట్లు తిరుపతిరెడ్డి వర్గీయులు తెలిపారు. ఉదయం 11 గంటలకు కడ కార్యాలయంలో లబ్దిదారులకు చెక్కులను అందించిన అనంతరం అక్కడి నుంచి నేరుగా కోస్గి పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వెళ్లడం జరిగింది. అయితే అధికారులు మాత్రం సీఎంఆర్‌ఎఫ్ నిధులు ఎన్ని మంజూరు అయ్యాయి. ఎంత మంది లబ్దిదారులకు అందించారో కడ కార్యాలయ అధికారులు సమాచారం ఇవ్వడానికి వెనుకంజ వేశారు. సిఎం కార్యాలయంలో మేము పనిచేస్తున్నాము ఎవ్వరికి సమాచారం ఇవ్వాల్సిన పని మాకు లేదు అనే రీతిలో ప్రవర్తిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రజలు ఏదైన సమస్య వస్తే అక్కడ అధికారులు అస్సలు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. దీనిపై కడ అధికారి దృష్టికి తీసుకురావడంతో అధికారులను వెనకేసుకువస్తు సముదాయించే ప్రయత్నం చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీపై ప్రజాపక్షం అధికారులకు సమాచారం కోసం ఫోన్‌చేసి వివరాలు సేకరించేందుకు ప్రయత్నించగా ఏ అధికారి కూడా ఫోన్ లిఫ్ట్ చేయకపోగ కనీసం సమాచారం కూడా ఇవ్వలేకపోయారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి వెనుక కడ ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాయల చైర్మన్ రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్ గుప్త, మార్కెట్ కమిటి చైర్మెన్ పట్నం అంబయ్యగౌడ్, నాయకులు తదితరులు పాల్గోన్నా రు.




## వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్న పాలకవర్గాలు

### సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:**వ్యవసాయ రంగాన్ని పాలక వర్గాలు నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ అన్నారు. కీసర మండలంలోని చీర్యాల గ్రామ పంచాయతిలో సిపిఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు జంగయ్యల అధ్యక్షతన గురువారం జరిగిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు కార్పొరేట్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయరంగాన్ని విస్మరించటం ఆందోళన కలిగిస్తున్న విషయమన్నారు. రైతాంగం కష్టించి పండించిన పంటలను మధ్య దళారులు, వ్యాపారులు సిండికేటుగా మారి దోచుకొంటున్నారన్నారు. జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు మాట్లాడుతూ పంటలకు సరైన ధరలు రాకపోవటంతో చేసిన అప్పులు తీర్చలేక నానారకాల అవస్థలకు గురవుతున్నా వారి వేదనలు మాత్రం పాలకులకు కనిపించటం లేదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప, సిపిఐ మండల కార్యదర్శి ఎన్.కృష్ణయాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కీసర నూతన కమిటి అధ్యక్షురాలిగా కోల శోభ, ప్రధాన కార్యదర్శిగా కొండ చిత్తారి, ఉపాధ్యక్షులుగా ఎన్. వెంకటేష్ యాదవ్, కోశాధికారిగా భరత్‌లు ఎన్నికయ్యారు.

## వీధి కుక్కల దాహార్తికి సిమెంట్ బౌల్స్

**ప్రజాపక్షం/కాప్రా :** వీధి కుక్కలతో పాటు ఇతర జీవ ప్రాణులకు దాహార్తి తీర్చేందుకు జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మల్లాపూర్ డివిజన్‌లో సిమెంట్ బౌల్స్‌లను ఏర్పాటు చేసారు. డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో ఈ బౌల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, జిహెచ్ఎంసి వెటర్నరీ అధికారి డా.శ్రీనివాస్‌రావు, సలీం, వంశీ, శ్రీను, స్థానికులు తండా వాసు గౌడ్, తిగుళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





## టిపిసి గల్లీదాబా ప్రారంభించిన మైనంపల్లి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని బండ చెరువు సాయి బాబా దేవాలయ సమీపంలో టిపిసి గల్లిదాభాను గురువారం మల్కాజిగిరి మజీ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను శుచికర వాతావరణంలో అందించటం ద్వారా ఆకట్టుకోవాలన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమా ర్, వెంకటేష్‌యాదవ్,శ్రీనివాస్,వినోద్,సంపత్ గౌడ్, ఉమేష్, నిర్వాహకులు దినేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి,నరేందర్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## అంగన్‌వాడీ పిల్లలను కంటికి రెప్పలా కాపాడాలి

### మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పిల్లల అంగవైకన్యం,తదితర అంశాలపై సిడిపిఓలు సూపర్ వైజర్లు ,సఖీ ,ఐసిడిఎస్‌లు సూపర్ వైజర్లుతో ప్రధాన కార్యదర్శి సమీక్ష సమవేశం నిర్వహించిన మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ , వయోవృద్దుల శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రమచంద్రన్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పిల్లలను వారి యొక్క తల్లిదండ్రులతో మాత్రమే పంపించాలని, కుంటుంబ సభ్యులు కాని వారితో పిల్లలను జీవితాలను మెరుగు పర్చేందుకు బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొని శారీరక వైకల్యం, ఫిట్స్, ఉబ్బసం, ఆక్మసిక కదలికలు స్పృహ తప్పడం, వినికిడి సమస్య కారణం లేకుండా శిశువు ఏడ్వడం, మానసిక సమస్య తదితర సమస్యలను గుర్తించి అవసరమైన చికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకుంటామాన్నారు. సామ్,మామ్ పల్లలు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. జిల్లాలో బాల్యవివాహాలపై సమాజంలో అవగాహన కల్పించాలని, స్వచంద్ర సంస్థలు నిర్వహిస్తున్న అనాథాశ్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు తనీఖిలు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలో అంగాన్వాడి కేంద్రాల్లోని వివిధ సమస్యలతో బాధపడే 140 మంది పిల్లలు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. గ్రామాల్లో అనారోగ్యంతో కూడిన పిల్లల వివరాలను సేకరించి శస్త్ర చికిత్సల కోసం కృషి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. 6 సంవత్సరాలు లోపు పిల్లల పెరుగుదల ఎదుగుదలకు అధికారులు కృషి చేయాలని ఆమె తెలిపారు. ఈ సమిక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హరతి, వయో వృద్దులు ట్రాన్స్ జెండర్ శాఖ డైరెక్టర్ శైలజ ఆర్జేడి, మోతి, రాష్ట సిడిపిఒ, అరుణ డిసివో జయసుధ, మానసిక వైద్యులు డాక్టర్ శ్రవణ్ రెడ్డి రుషికేశ్ పాల్గోన్నారు.

